సాక్షి
కామారెడ్డి

గురువారం । 25 । ఏప్రిల్ । 2024



సమస్యలు పరిష్కరించాలి
తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లు బుధవారం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు.
- IIIలో ▸



ఆంగ్ల భాషతో గుర్తింపు
జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం ఆంగ్ల భాష దినోత్సవాన్ని నిర్వహించారు.
- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
41.8 /21.7

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

ఇంటర్‌లో అట్టడుగుకు..

- గతేడాది 13.. ఈసారి 35వ స్థానం
- ఫస్టియర్‌లో 34.81 శాతం, సెకండియర్‌లో 44.29 శాతం పాస్
- జిల్లాలో గణనీయంగా తగ్గిన ఉత్తీర్ణత



కామారెడ్డి టౌన్: ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు నిరుత్సాహ పరిచారు. బుధవారం ఇంటర్మీయట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అట్టడుగున నిలిచారు. సెకండియర్‌లో 44.29 శాతం పాసవ్వగా.. ఫస్టియర్‌లో 34.81 శాతమే ఉత్తీర్ణులయ్యారు. దీంతో గతేడాది ఇంటర్ ఫలితాల్లో 13వ స్థానంలో ఉన్న జిల్లా.. ఈసారి 35వ స్థానానికి పడిపోయింది.

ఫస్టియర్ ఫలితాలు..
జిల్లాలో 7,658 మంది విద్యార్థులు ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు రాశారు. ఇందులో 2,666 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 3,873 మంది బాలికలు పరీక్షలు రాయగా 1,711 ఉత్తీర్ణులయ్యారు. బాలికలలో 44.18 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 3,785 మంది బాలురు పరీక్షలు రాయగా.. 955 మందే పాసయ్యారు. బాలురలో ఉత్తీర్ణత శాతం 25.33 కావడం గమనార్హం. వొకేషనల్‌లో 1,502 మంది విద్యార్థులకుగాను 701 మంది పాసవగా ఉత్తీర్ణత శాతం 46.67 గా నమోదైంది. ఇందులో బాలికల్లో 791 మందికి 494 మంది, బాలురలో 711 మందికి 207 మంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ ఫలితాలు..

కళాశాల	సెకండియర్ విద్యార్థులు/ఉత్తీర్ణత	ఫస్టియర్ విద్యార్థులు/ఉత్తీర్ణత
కామారెడ్డి	122/47	150/36
భిక్కనూరు	84/04	57/04
దోమకొండ	129/21	130/09
మాచారెడ్డి	135/21	135/01
ఎల్లారెడ్డి	125/20	108/10
సదాశివనగర్	134/06	160/05
గాంధారి	98/13	101/15
తాడ్వాయి	92/10	115/07
రామారెడ్డి	103/06	95/05
లింగంపేట	155/26	134/14
బిచ్కుంద	166/44	188/34
జుక్కల్	87/10	101/05
పిట్లం	168/26	149/13
మద్నూర్	101/20	94/09
బాన్సువాడ	213/72	139/47
బాన్సువాడ(బాలికలు)	87/29	100/22

సెకండియర్ ఫలితాలు..
సెకండియర్‌లో 7,234 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,204 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలికలు 3,703 మంది పరీక్షలు రాయగా 1,996 మంది ఉత్తీర్ణులయ్యారు. 53.9 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 3,531 మంది బాలురకుగాను 1,208 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 34.21గా నమోదైంది. అలాగే వొకేషనల్‌లో 1,027 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 620 మంది ఉత్తీర్ణత సాధించారు. 60.37 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలలో 568 మందికిగాను 445 మంది, బాలురలో 459 మందికిగాను 175 మంది ఉత్తీర్ణులయ్యారు.

డాక్టర్‌నవుతా..



మాది అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామం. నాన్న సురేందర్‌గౌడ్ వ్యవసాయం చేస్తుంటారు. అమ్మ కవిత గృహిణి. తల్లిదండ్రులు, లెక్చరర్ల ప్రోత్సాహంతో కష్టపడి చదివి బైపీసీలో 990 మార్కులు సాధించగలిగాను. డాక్టర్‌నై పేదలకు సేవ చేస్తా.
– కే.అఖిల, సాందీపని కళాశాల, కామారెడ్డి

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



మాది దోమకొండ. నాన్న రామకృష్ణ చనిపోవడంతో అన్నీ అమ్మ చంద్రకళే చూసుకుంది. బీడీలు చుడుతూ, వ్యవసాయంతోపాటు కూలి పనులు చేస్తూ నన్ను చదివిస్తోంది. ఇంటర్ ఎంపీసీలో 991 మార్కులు వచ్చినందుకు సంతోషంగా ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నదే నా లక్ష్యం.
– పి.చందన, సాందీపని కళాశాల, కామారెడ్డి

సివిల్స్ సాధించాలన్నది లక్ష్యం..



అమ్మానాన్నలు అనురాధ, వెంకట్‌రెడ్డి వ్యవసాయం చేస్తారు. అక్క మానవిత బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్‌లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు (468) సాధించినందుకు ఆనందంగా ఉంది. సివిల్స్‌కు ఎంపిక కావాలన్న లక్ష్యంతో చదువుతున్నా.
– వలకొండ చర్విత, అంతంపల్లి

కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి



మాచారెడ్డిలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి
- రోడ్ షోలలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం/మాచారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలంటూ హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన మాచారెడ్డి మండలకేంద్రంతో పాటు జిల్లాకేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ఆయన మాట్లాడుతూ పని చేసే పార్టీనే నమ్మాలన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చామన్నారు. పదేళ్లు ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అంతకు ముందు ఐదేళ్లు ఎంపీగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ సైతం ఏమీ చేయలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, ఎంపీపీలు పిప్పిరి ఆంజనేయులు, లోయపల్లి నర్సింగరావు, జెడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బాల్ చంద్రం, కుంబాల రవి, మాసుల లక్ష్మీనారాయణ, పిప్పిరి వెంకటి, సంగి మోహన్, గెరిగంటి లక్ష్మీనారాయణ, హంజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో బీఆర్‌ఎస్ రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌లోకి ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ బీఆర్‌ఎస్‌ను వీడారు. ఆయన బుధవారం సంగారెడ్డిలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ చైర్మన్‌ను ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అభినందించారు.

చైర్మన్‌పై అవిశ్వాసం నోటీస్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణపై కౌన్సిలర్లు బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. నోటీసు ఇచ్చినవారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుజాతతో పాటు కౌన్సిలర్లు శ్రీకాంత్, సాయిలు, శ్రీనివాస్, భూంగారి రాము, నీలకంఠం, విజయలక్ష్మి, జీనత్ సుల్తానా, భూదేవి, బాలమణి ఉన్నారు.

ఉద్యాన క్షేత్రంలో మామిడి తోట వేలం



ఎల్లారెడ్డిరూరల్: నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెదలోని ఉద్యాన క్షేత్రంలోగల మామిడి తోటకు ఉద్యాన శాఖ అధికారులు బుధవారం వేలం పాట నిర్వహించారు. వేలంలో ఏడుగురు పాల్గొన్నారు. గోరే బాయి అనే వ్యక్తి రూ. 1.37 లక్షలకు తోటను దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు రామకృష్ణ, విజయ్‌భాస్కర్‌రెడ్డి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశాయిపేట్‌లో దంగల్



బాన్సువాడ రూరల్: దేశాయిపేట్‌లో శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా బుధవారం కుస్తీపోటీలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి గ్రామాలనుంచే కాకుండా ఇతర ప్రాంతాలనుంచీ మల్లయోధులు తరలివచ్చి పోటీలలో పాల్గొన్నారు. వరంగల్‌కు చెందిన రమ్య, మహబూబ్‌నగర్‌కు చెందిన బాలమణిల కుస్తీని తిలకించడానికి జనం వందలాదిగా తరలివచ్చారు. విజేతలకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు వేరువేరుగా నగదు బహుమతులు అందించారు.

బాధ్యతల స్వీకరణ



బీబీపేట: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఇన్‌చార్జి చైర్మన్‌గా బీబీపేటకు చెందిన ఇంద్రసేనారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ మోహన్ తన పదవికి రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డిని ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించారు. బీబీపేట పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్న ఆయన ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు.

‘రైతుల ఖాతాలలో రూ.70 కోట్లు జమ చేశాం’

కామారెడ్డి రూరల్: కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలలో ఇప్పటివరకు రూ.70 కోట్లు జమ చేశామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్ బాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన కామారెడ్డి మండలం గర్గుల్, రామారెడ్డి మండలం కన్నాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 264 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 14,331 మంది రైతుల నుంచి 89,244 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. రూ. 196.61 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశామని పేర్కొన్నారు. రైతులకు త్వరగా ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పౌరసరఫరాల మేనేజర్ నిత్యానంద్, అడ్లూర్ ఎల్లారెడ్డి సహకార సంఘం సీఈవో భైరయ్య, ఏఈవో బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.



గర్గుల్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌వో మల్లికార్జున్ బాబు

రెండు రోజుల్లో ప్రారంభిస్తాం

కామారెడ్డి క్రైం: తాడ్వాయి మండలంలోని బ్రాహ్మణపల్లి, కృష్ణాజీవాడిలలో రెండు రోజులలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు డీఎస్‌వో మల్లికార్జున్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా ధాన్యంలో తేమ శాతం లేనందున, హమాలీల కొరత వల్ల కేంద్రాలు ఏర్పాటు చేయడంలో కాస్త ఆలస్యమైందని పేర్కొన్నారు. సోమారం, తాడ్వాయి, దేమికలాన్, కరడ్‌పల్లి, నందివాడలలో ధాన్యం వచ్చిన వెంటనే కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు.

‘ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలి’



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. బుధవారం ఆయన హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులతో మాట్లాడారు. ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో క్యూ లైన్ల వద్ద నీడ వసతి కల్పించాలన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల నమోదుకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ విధులలో పాల్గొనే సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. వీసీలో కామారెడ్డి నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ

కామారెడ్డి క్రైం: బూత్ లెవెల్ అధికారులు గురువారం నుంచి మే 8వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల ప్రచారం, సభలకు ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, కాశీం అలీ, నరేందర్, ఎన్నికల విభాగం అధికారులు అనిల్ కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘మళ్లీ గెలిచేది బీజేపీనే’



మాట్లాడుతున్న అరుణతార

బిచ్కుంద: పార్లమెంట్ ఎన్నికలలో మళ్లీ గెలిచేది, కేంద్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీనేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పేర్కొన్నారు. బుధవారం పెద్ద దేవాడలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంతో ఆమె మాట్లాడారు. అనంతరం ఇంటింటికి వెళ్లి బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తల కృషితో పార్టీ బలోపేతమవుతోందన్నారు. యువకులు స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారన్నారు. ప్రజలు బీజేపీవైపు చూస్తున్నారని, వరుసగా మూడోసారి నరేంద్రమోదీనే ప్రధాన మంత్రి కావడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, పండరి జాదవ్, శ్రీధర్ పంతులు, రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజు 11 నామినేషన్లు..



నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్

కామారెడ్డి క్రైం: జహీరాబాద్ నియోజకవర్గంలో బుధవారం 11 నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరుకు అందజేశారు. ఆయన వెంట సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, పలువురు బీఆర్ నేతలు ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ రెండు సెట్ల నామినేషన్లు వేశారు. కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే ధర్మ సమాజ్ పార్టీ నుంచి దేవ శిఖామణి, రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ అభ్యర్థిగా మహ్మద్ మున్వర్ హుస్సేన్, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా బట్టెంకి బాల్‌రాజ్, స్వతంత్ర అభ్యర్థులుగా తలారి అశోక్, జైపాల్ నాయక్ జాదావత్, రమేశ్ సజ్జాపూర్, యాకూబ్ షరీఫ్, గొల్లపల్లి మణయ్య ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు.



బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్..



బీఎస్పీ అభ్యర్థి బాల్‌రాజ్..

‘పార్టీ గెలుపుకోసం కృషి చేయాలి’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

రాజంపేట: కార్యకర్తలు పట్టుదలతో పని చేసి పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోరారు. బుధవారం బస్వన్నపల్లిలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో బూత్ స్థాయి ఇన్‌చార్జీలను నియమించుకుని ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికలలో వచ్చే ఫలితాలు భవిష్యత్తులో జరిగే లోకల్ బాడీ ఎన్నికలకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని బీజేపీ అభ్యర్థికి మంచి మెజారిటీ కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, మర్రి రాంరెడ్డి, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, నాయకులు పైలా కృష్ణారెడ్డి, లింగారావు, రవీందర్‌రావు, మర్రి బాపురెడ్డి, సంతోష్‌రెడ్డి, తానాజీరావు, పులేందర్‌రెడ్డి, నరేందర్, యోగా రాంరెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సురేష్, కృష్ణప్రశాంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'తెలంగాణ సాహిత్య ఉద్యమం' పుస్తకావిష్కరణ



కామారెడ్డి అర్బన్ : తెలంగాణ ఉద్యమ సాహిత్య విలువలను భావితరాలకు అందించే ప్రయత్నం చేసిన రచయిత తుర్లపాటి లక్ష్మి, ఎనిశెట్టి శంకర్‌ల సాహిత్య కృషి ఉద్యమ చరిత్రలో నిలిచిపోతుందని ప్రముఖ కాలమిస్ట్ జి.లచ్చయ్య అన్నారు. తుర్లపాటి లక్ష్మి, శంకర్ రాసిన 'తెలంగాణ ఉద్యమ సాహిత్యం–ఉమ్మడి నిజామాబాద్ జిల్లా' పుస్తకావిష్కరణ ను జి.లచ్చయ్య స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని అమర వీరుల స్థూపం వద్ద ఉద్యమకారుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కే.వేణుగోపాల్ మాట్లాడుతూ పుస్తక రచయితలు లక్ష్మి,శంకర్ 360 పేజీలున్న పుస్తకంలో సమస్త లిఖిత సాహిత్యాన్ని సేకరించి రాష్ట్ర ఉద్యమంలో నిజామాబాద్ జిల్లా కృషిని భవిష్యత్తు తరాల కోసం మార్గనిర్దేశంగా పరిశోధక విద్యార్థులు, కర్తలకు, సాహిత్యాభిమానులకు అందించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు గఫూర్‌శిక్షక్, యెనిశెట్టి గంగాప్రసాద్, బి.నాగభూషణం, ఎ.మనోహరరావు తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కామారెడ్డి అర్బన్ : ఈనెల 28న సూర్యపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సర్టిఫికెట్లతో బుధవారం స్థానిక ఇందిరా గాంధీ స్టేడియంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్, ప్రతినిధులు నవీన్ కుమార్, భాస్కర్‌రెడ్డి, మహేష్, ప్రశాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలో రెండు రోజుల్లో వరికొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని సివిల్ సప్లయ్ డీటీ శ్రీనివాస్ అన్నారు. తాడ్వాయి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో వరికొనుగోలు కేంద్రం స్థలానికి బుధవారం వచ్చి రైతులతో మాట్లాడారు. బుధవారం 'సాక్షి'లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి అనే శీర్షిక వచ్చిన విషయం తెలిసిందే. ఈ వార్తకు స్పందించిన అధికారులు వచ్చి రైతులతో మాట్లాడారు. హమాలీలను సమకూర్చడమే కాకుండా మయిశ్చర్ వచ్చిన వడ్లను కొనుగోలు చేస్తామన్నారు. ఆయన వెంట స్పెషల్ ఆఫీసర్ నగేష్, సీఈవో నర్సిములు, రైతులు, గ్రామపెద్దలు ఉన్నారు.

సైన్స్‌లో విద్యార్థులను భాగస్వామ్యాన్ని పెంచాలి

రామారెడ్డి : సైన్స్‌లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి సైన్స్ టెక్నాలజీ ఇంజినీరింగ్, మ్యాథమటిక్స్‌లో ప్రమోషన్లు అందించడానికి మహిళా అండర్ గ్రాడ్యుయేట్లకు సమగ్ర మార్గదర్శకత్వం అందించనున్నట్లు సదాశివనగర్ మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (మర్కల్) కామారెడ్డి ప్రిన్స్‌పాల్ రాధిక అన్నారు. ఆన్‌లైన్‌లో పాల్గొనే 30 డిగ్రీ కళాశాలల్లో సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (మర్కల్) కామారెడ్డి ఒకటి. కళాశాలకు చెందిన ఎంపీసీఎస్ గ్రూప్ నుంచి విద్యార్థిని అమూల్య నెట్‌వర్కింగ్ కాంపిటీషన్‌లో ఎంపిక కాగా, ప్రిన్స్‌పాల్ రాధిక, సమన్వయ కర్తలు డాక్టర్ ఉజ్మాసుల్తానా, డాక్టర్ కీర్తి, అధ్యాపక బృందం అభినందించారు.

ఉత్తమ విద్యార్థుల మనోగతాలివి..

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



నాకు రాష్ట్ర స్థాయిలో 467 మార్కులు రావడం ఆనందంగా ఉంది. మా నాన్న చంద్రశేఖర్ పట్టణంలో చిన్న వ్యాపారం చేస్తుంటాడు. అమ్మ రమ గృహిణి. కామారెడ్డి పట్టణంలో నివాసం ఉంటున్నాం. మాది మధ్యతరగతి కుటుంబమే. నేను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

– డి రచన, ఎంపీసీ ఫస్టియర్, సాందీపని కళాశాల

ఐపీఎస్ కావాలన్నదే నా లక్ష్యం



మాది రామాయంపేట. మా నాన్న శ్రీనివాస్ నా చిన్నప్పుడే చనిపోయాడు. అన్ని తానై మా అమ్మ లక్ష్మి ఎంతో కష్టపడుతూ నన్ను చదివించింది. అమ్మ కష్టానికి ఫలితంగా నేను రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించాను. ఐపీఎస్ కావాలన్నదే నా లక్ష్యం.

– ఎం భవాని, ఎంపీసీ, ఫస్టియర్, 467 మార్కులు, సాందీపని కళాశాల

వైద్యుడిని అవుతాను..



మా అమ్మ హైమద్, తల్లి సుల్తానా. మేము కామారెడ్డి పట్టణంలో ఉంటాం. మా నాన్న చిన్న వ్యాపారి. నాకు రాష్ట్ర స్థాయి లో మంచిమార్కులు రావాడం ఆనందంగా ఉంది. డాక్టర్ కావాలన్నదే నా లక్ష్యం.

– మహమ్మద్ బిలాల్, బైపీసీ ఫస్టియర్, 435 మార్కులు, సాందీపని కళాశాల విద్యార్థి

సీఏ కావాలని లక్ష్యం..



మాది మాచారెడ్డి మండలం ఎల్పుకొండ గ్రామం. మా నాన్న వాజిద్ షరీఫ్ వ్యవసాయం చేస్తుంటాడు. అమ్మ మెహరాజ్ బేగం గృహిణి. మాది పేద కుటుంబం. నేను చార్టెడ్ అకౌంటెంట్ కావాలన్నదే నా లక్ష్యం.

– ఫర్హానా బేగం, సీఈసీ ఫస్టియర్, 486, సాందీపని కళాశాల

సివిల్స్ సాధిస్తా..



మాది కామారెడ్డి పట్టణం. మా నాన్న అబ్దుల్ మోయిజ్ చిన్న వ్యాపారి. అమ్మ పర్వీన్ బేగం గృహిణి. నేను సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధిస్తా. మాది మధ్యతరగతి కుటుంబం. చదువుల్లో ప్రణాళికబద్ధంగా చదివాను.

– శ్రీరిన్ బేగం, 969 మార్కులు, సీఈసీ సెకండియర్, కామారెడ్డి

తల్లిదండ్రుల కల నెరవేరుస్తా



మాది కామారెడ్డి పట్టణం. నేను శ్రీ చైతన్య హైదరాబాద్‌లో చదివా. నాన్న చక్రధర్‌రావు వ్యాపారి. అమ్మ శ్రీదేవి గురుకులం పాఠశాలలో కాంట్రాక్ట్ టీచర్‌గా పని చేస్తుంది. సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కావాలన్నది నా కల.

– శ్రీ వాత్సవ్ కులకర్ణి, 467, ఎంపీసీ ఫస్టియర్, కామారెడ్డి

బాన్సువాడలో..

బాన్సువాడ రూరల్ : బాన్సువాడలోని కొయ్యగుట్ట, బోర్లంక్యాంప్‌లోని గురుకుల కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. సెకండియర్‌తో పోలిస్తే ఫస్టియర్‌లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గింది. కొయ్యగుట్టలోని గురుకుల కళాశాలలో ఫస్టియర్‌కు చెందిన 72 మందికి గాను 36 మంది మాత్రమే పాస్ అయ్యారు. అలాగే సెకండియర్‌లో 66మందిలో 49 పాసయ్యారని ప్రిన్సిపల్ శోభారాణి తెలిపారు. బైపీసీలో అత్యధికంగా తేజశ్రీ 433 సాధించారు. అలాగే బోర్లంక్యాంపులోని గురుకుల కళాశాలలో ఫస్టియర్‌లో 70శాతం, సెకండియర్‌లో 84.2శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ పద్మకుమారి తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో 437(సురేఖ), బైపీసీలో 431(సంధ్యారాణి), సెకండియర్ ఎంపీసీలో వి.రోష్ని 972, బైపీసీలో కే సంధ్యారాణి 982 సాధించారు. కొత్తాబాదిలోని తెలంగాణ మాడల్‌స్కూల్, కళాశాలలో ఫస్టియర్‌లో 60శాతం, సెకండియర్‌లో 56శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రిన్సిపల్ ఫకీరయ్య తెలిపారు. ఫస్టియర్‌లో అత్యధికంగా ఎంపీసీలో 453 (ముదస్సిర్), బైపీసీలో 436(మానస), సీఈసీలో 483 (దీపిక)మార్కులు వచ్చాయని, సెంకడియర్ ఎంపీసీలో 974 (లక్ష్మీ ప్రసన్న), బైపీసీలో 968(ఆకాంక్ష), సీఈసీలో 952(అనుష)మార్కులు వచ్చాయన్నారు.



తేజశ్రీ, (433) బైపీసీ | కే.సంధ్యారాణి, (982) బైపీసీ | రోష్ని(972), ఎంపీసీ | అనుష(952) సీఈసీ

బీబీపేటలో..


సాత్విక


రిషిక


మానస

బీబీపేట : ఇంటర్ ఫలితాల్లో మండలానికి చెందిన పలువురు విద్యార్థులు సత్తాచాటారు. బీబీపేటకు చెందిన కాల్వ సాత్విక బైపీసీ గ్రూప్ సెకండియర్ 985 మార్కులు సాధించారు. పి. అక్షిత ఎంపీసీ ఫస్టియర్‌లో 460 మార్కులు, ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన జె.రిషిక ఎంపీసీ ఫస్టియర్‌లో 443 సాధించారు. కస్తూర్బా కళాశాలలో పి.మానస సెకండియర్‌లో 941 మార్కులు సాదించింది. అలాగే శ్రావ్య 836 మార్కులు సాధించారు.

దోమకొండ కేజీబీవీలో..


అఖిల(911) ఎంపీసీ


శ్రావ్య (368) ఎంపీసీ

దోమకొండ : మండలంలోని సీతారంపల్లి గ్రామంలోని ప్రభుత్వ కేజీబీవీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. సెకండియర్‌లో 72 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్స్‌పల్ మమత తెలిపారు. లావణ్య 905 మార్కులు సాధించారు. బైపీసీలో దేవలక్ష్మి 886 మార్కులు సాధించింది. పూజల 885 మార్కులు సాధించింది. ఫస్టియర్ ఎంపీసీలో అఖిల 358 మార్కులు సాధించింది. బైపీసీలో రసజ్ఞ 364 మార్కులు, రోజిని 350 మార్కులు సాధించినట్లు ప్రిన్స్‌పల్ వివరించారు.

రాజంపేటలో..


గజ్జెల జ్యోత్స్న(986)

రాజంపేట : రాజంపేట మండల కేంద్రానికి చెందిన గజ్జెల జ్యోత్స్న ఇంటర్ సెకండియర్ ఫలితాలో ప్రతిభ చూపారు. బాచుపల్లి నారాయణ కళాశాలలో ఎంపీసీ చదువుతున్న జ్యోత్స్న 986 మార్కులు సాధించారు. దీంతో గ్రామస్తులు విద్యార్థినిని అభినందించారు.



సుభాష్(466), ఎంపీసీ | అరుణ్ (463) ఎంపీసీ | సాయికుమార్ (461) ఎంపీసీ | నితిన్(460) ఎంపీసీ | సాయినాథ్ (967)ఎంపీసీ | ప్రేమ్‌సింగ్ (956) ఎంపీసీ

నాగిరెడ్డిపేట గిరిజన గురుకుల ప్రతిభ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట గిరిజన బాలుర గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించినట్లు ప్రిన్సిపల్ అమర్‌సింగ్ బుధవారం తెలిపారు. రాష్ట్రస్థాయి మార్కులను సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

గాంధారి కళాశాలల్లో..

గాంధారి(ఎల్లారెడ్డి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్‌లో ఆశించిన ఫలితాలు రాలేదు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులు కేవలం 14 శాతం ఉత్తీర్ణత సాధించగా కస్తూర్బా బాలికల కళాశాలలో 28 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్ర.జూ. కళాశాలలో సెకండియర్‌లో 98 మంది విద్యార్థులకు గాను 14 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్‌లో 96 మంది విద్యార్థులకు గాను 12 మంది ఉత్తీర్ణులయ్యారు.



అంకిత ఎంపీసీ (877) | సరస్వతి బైపీసీ (868) | లలిత, కేజీబీవీ (881) | స్వప్న, కేజీబీవీ (810)



అనూష, బైపీసీ (923) | సరిత,బైపీసీ (423) | నాహెర్, బైపీసీ (918) | ఫర్హాన్, ఎంపీసీ (866) | రిజ్వాన్, ఎంపీసీ (427)

లింగంపేటలో..


సురేష్ బైపీసీ (426)


ఆసిఫ్ బైపీసీ (822)


షాహిస్తా ఎంపీసీ(777)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గింది. ఫస్టియర్‌లో 125 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా కేవలం 14 మంది మాత్రమే పాసయ్యారు. 11 శాతం మాత్రమే ఉత్తీర్ణత నమోదైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ తెలిపారు. అలాగే సెకండియర్‌లో 142 మంది విద్యార్థులకు గాను 23 మంది మాత్రమే పాసై 16 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. కళాశాల టాపర్లుగా మోహమ్మద్ ఆసిఫ్ బైపీసీలో 822/1000, ఎంపీసీలో షాహిస్తా 777/1000 మార్కులు సాధించారు. కసూర్బా గురుకుల బాలికల కళాశాలలో ఫస్టియర్ 49 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 38 మంది పాసయ్యారని ప్రత్యేకాధికారి వాసంతి తెలిపారు. సెకండియర్‌లో 46 మందికిగాను 38 మంది పాసయ్యారన్నారు. మండల టాపర్‌గా కస్తూర్బా బాలికల కళాశాలకు చెందిన బైపీసీ సెకండియర్ విద్యార్థి అనూష 923 సాధించింది. ఫస్టియర్ బైపీసీ విద్యార్థికి 423 సాధించారు. మైనార్టీ కళాశాల మొదటి 37 మంది పరీక్షలు రాయగా 17 మంది పాసయ్యారని ప్రిన్సిపాల్ కిషన్ తెలిపారు. సెకండియర్‌లో 31 మందికి 16 మంది పాసయ్యారు. సెకండియర్‌లో నాహెర్ బైపీసీ 918, ఫర్హాన్ ఎంపీసీ 866, ఫస్టియర్‌లో రిజ్వాన్ ఎంపీసీ 427, సురేష్ బైపీసీ 426 సాధించినట్లు తెలిపారు.

ఎల్లారెడ్డిలో..



శ్రీఅర్చన(443) ఎంపీసీ | ఆశ్రిత(945), ఎంపీసీ | రాము(925) ఎంపీసీ | పూజ (917) బైపీసీ సెకండియర్

ఎల్లారెడ్డి: ఇంటర్మీడియట్ ఫలితాలలో ఎల్లారెడ్డి ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినీలు ఎంపీసీ సెకండియర్‌కు చెందిన రాము 925 మార్కులను సాధించగా, బైపీసీకి చెందిన విద్యార్థిని పూజ 917 మార్కులను సాధించారు. మోడల్ కళాశాలకు చెందిన అశ్రిత ఎంపీసీ సెకండియర్‌లో 945 మార్కులను సాధించగా, బైపీసీ సెకండియర్‌లో హబీబా మదీహా 922 సాధించారు. దిల్‌నాజ్ బైపీసీలో 417 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ సాయిబాబా తెలిపారు. ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఎంపీసీ సెకండియర్‌లో సచిన్ 907 సాధించగా, వంశీకృష్ణ బైపీసీలో 914 మార్కులను సాధించారు. సెకండియర్‌లో 73 శాతం ఫలితాలను సాధించినట్లు ప్రిన్సిపల్ కృతమూర్తి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్‌లో 108 మందికి గాను 11 మంది మాత్రమే ఉత్తీర్ణులు కాగా 10.18 శాతం, సెకండియర్‌లో 116 మందికి గాను 18 మాత్రమే ఉత్తీర్ణులు కాగా 15.51 శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ హేమచందర్ తెలిపారు.

చెక్‌పోస్టు వద్ద భారీగా నగదు పట్టివేత



నిజాంసాగర్: సంగారెడ్డి – కామారెడ్డి జిల్లాల సరిహద్దున నిజాంసాగర్ మండలంలోని వెల్గనూర్ చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి రూ. 53 లక్షల 42 వేలు స్వాధీనం చేసుకున్నట్లు బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. సంగారెడ్డి– నాందేడ్ జాతీయ రహదారిపై వెళ్తున్న ప్రైవేట్ వాహనాలను తనిఖీ చేయగా హైద్రాబాద్ నుంచి మధ్య ప్రదేశ్ వైపు ఐచర్ వాహనంలో వెళ్తున్న నవీన్ బరదియ అనే వ్యక్తి వద్ద నగదు పట్టుకున్నామన్నారు. నగదుకు సంబంధించిన ఆధారాలు లేకుండా అక్రమంగా తరలిస్తుండటంతో సీజ్ చేశామని సీఐ తెలిపారు. ఎస్సై సుధాకర్ పాల్గొన్నారు.

జ్యోతిభాపూలే విద్యార్థుల ప్రతిభ


హరిణి (459), ఎంపీసీ


అశ్విని (424) బైపీసీ

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లిలోని మహాత్మ జ్యోతిభా పూలే కళాశాల ఫస్టియర్ ఫలితాల్లో 80.39 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా ఫలితాల్లో రెండో స్థానంలో నిలిచింది. ఎంపీసీలో 20 మంది విద్యార్థులకు 18 మంది పాస్‌కాగా హరిణి 459 మార్కులు సాధించి కళాశాలలో ప్రథమ స్థానం పొందిండి. బైపీసీ విభాగంలో 27 మందికి గాను 21 మంది పాస్ కాగా అశ్విని 424 మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ మణిదీప్తి తెలిపారు. హరిణి స్వస్థలం దోమకొండకాగా అశ్విని బిచ్కుందకు చెందినవారు.

గురుకుల కళాశాలలో..

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఫస్టియర్‌లో ఎంపీసీలో 71.79 శాతం విద్యార్థులు, బైపీసీ ఫస్టియర్‌లో 88.57 శాతం విద్యార్థులు ఎంపీసీ సెకండియర్‌లో 77.14శాతం విద్యార్థులు, బైపీసీ సెకండియర్‌లో 67.85శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి తెలిపారు. ఎంపీసీ ఫస్టియర్‌లో 39 మందికిగాను 28 మంది పాసయ్యారు. బైపీసీ విభాగంలో 35 మందికిగాను 31 మంది విద్యార్థులు పాసయ్యారు. ఎంపీసీ సెకండియర్‌లో 35 మంది విద్యార్థులకు గాను 27 మంది విద్యార్థులు, బైపీసీ ఫస్టియర్‌లో 28 మందికిగాను 19 మంది విద్యార్థులు పాసయ్యారు. ఎంపీసీ ఫస్టియర్‌లో బి. నగేష్ 451 సాధించి ఫస్ట్ ప్లేస్, ఎస్ శివానంద్ 450 సాధించి సెకండ్‌ప్లేస్, బైపీసీ ఫస్టియర్‌లో ఎస్ మనీష్ 411 సాధించి కళాశాలలో ఫస్ట్‌ప్లేస్, ఎస్ అక్షయ్‌కుమార్ 400 సాధించి సెకండ్ ప్లేస్, ఎంపీసీ సెకండియర్ జే తారక్ 938 సాధించి కళాశాల ఫస్ట్‌ప్లేస్, కే.తేజ 930 సాధించి సెకండ్‌ప్లేస్, బైపీసీలో జే అనుదీప్ 923 ఫస్ట్‌ప్లేస్, కే భాను ప్రసాద్ 897 సాధించి సెకండ్‌ప్లేస్ సాధించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో7.01 శాతం , సెకండియర్‌లో 5.06శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో 57 మంది విద్యార్థులకు గాను నలుగురు, సెకండియర్‌లో 79 మంది విద్యార్థులకు గాను నలుగురు, మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో ఎం రంజిత్‌కుమార్ 383 సాధించి కళాశాలలో ప్రథమ స్థానం పొందాడు. సెకండియర్‌లో నాగవైష్ణవి, 805 సాధించి ఫస్ట్‌ప్లేస్ సాధించారు. సీఈసీ విభాగంలో ఫస్టియర్‌లో ఎస్ చరణ్ 335 సాధించి కళాశాలలో ఫస్ట్‌ప్లేస్ సాధించారు. సీఈసీ సెకండియర్‌లో నిఖిల్ 636 సాధించి కళాశాలలో ఫస్ట్‌ప్లేస్‌లో నిలిచారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లింగంపేట: మండలంలోని పొల్కంపేట రోడ్డులో ఒంటర్‌పల్లి తండా సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. ఎక్కపల్లి తండాకు చెందిన లంబాడి సంతోష్ భార్యతో కలిసి బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో సంతోష్ కాలు విరిగింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బాధితులను ఆస్పత్రికి తరలించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో నెల రోజుల జైలు

డిచ్‌పల్లి: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాలు.. డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఓ వ్యక్తిని బుధవారం నిజామాబాద్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎంఎం అలీ సిరాజ్ ఎదుట పోలీసులు హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆ వ్యక్తికి 30 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇన్ని రోజుల శిక్ష పడటం ఇదే తొలిసారని ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

నందిపేట్: నందిపేటలోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన మల్లారం మౌనిక (30) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మౌనికకు మతిస్థిమితం సరిగా లేదని, బుధవారం నుంచి కనిపించడం లేదన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడలో పేకాట స్థావరంపై బుధవారం దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. వారి నుంచి రూ.58,430 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని తెలిపారు.

అదృశ్యమైన వృద్ధుడు శవమై కనిపించాడు


పెద్ద గంగారాం(ఫైల్)

ఇందల్వాయి: ఎనిమిది నెలల క్రితం అదృశ్యమైన వృద్ధుడు శవమై కనిపించాడు. మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన కలిగోట పెద్ద గంగారాం(60) గత ఆగస్టులో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఆయన మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో గ్రామ శివారులో లభ్యమైంది. 15 రోజుల క్రితం చనిపోయి ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

వినాయక్‌నగర్‌లో చైన్‌స్నాచింగ్

ఖలీల్‌వాడి:నగరంలోని నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో బుధవారం చైన్ స్నాచింగ్ జరిగింది. హౌజింగ్ బోర్డు కాలనీలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు రెండున్నర తులాల బంగారు చైన్ లాక్కెళ్లారు. ఘటన స్థలాన్ని ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, సీఐ నరహరి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

మద్నూర్: మంజీర నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక బొలెరో వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రాత్రిపూట అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం అందడంతో పెట్రోలింగ్ ముమ్మరం చేశామని ఎస్సై తెలిపారు. బిచ్కుంద మండలం ఖద్‌గావ్ శివారులోని మంజీర నుంచి మూడు ట్రాక్టర్‌లు, ఒక బొలెరో వాహనంలో ఇసుక తరలిస్తుండగా డోంగ్లీ మండలం దోతి శివారులో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఖద్‌గావ్ గ్రామానికి చెందిన ఆరుగురు, మహారాష్ట్రకి చెందిన ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు.

మాచారెడ్డి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పాల్వంచ వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా చుక్కాపూర్ శివారులో పట్టుకున్నామన్నారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

మాచారెడ్డి:హనుమాన్ మాల ధరించవద్దని కుటుంబ సభ్యులు వారించినందుకు మనస్తాపానికి గురై ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం లక్ష్మీరావులపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఈరవేణి అంజయ్య(58) కుమారుడు ప్రవీణ్ హనుమాన్ మాల ధరించాడు. అంజయ్య కూడా మాల ధరిస్తానని అనడంతో వద్దని కుటుంబ సభ్యులు వారించారు. దీంతో మనస్తాపానికి గురైన అంజయ్య మంగళవారం సాయంత్రం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగ


మృతి చెందిన మేక

లింగంపేట: లింగంపేట సమీపంలోని పాత చక్కెర ఫ్యాక్టరీ సమీపంలో బుధవారం 11 కేవీ విద్యుత్ తీగ తెగిపడింది. దీంతో అక్కడ మేస్తున్న మేక విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు యజమాని ఇస్లావత్ హనుమంత్ తెలిపారు. మేక విలువ రూ. 10వేలు ఉంటుందన్నారు.

చెప్పులు ఎత్తుకెళ్లిన దొంగ

ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌నగర్‌లో చోరీకి వచ్చిన వ్యక్తికి ఏమి దొరకకపోవడంతో చెప్పులు ఎత్తుకెళ్లాడు. సుభాష్‌నగర్‌లోని వెంకీ అపార్ట్‌మెంట్‌లోకి ఈ నెల 11న ఓ వ్యక్తి బాలుడితో కలిసి వచ్చాడు. అక్కడ చోరీ చేయడానికి ప్రయత్నించగా ఏమి లభించలేదు. దీంతో చెప్పులు ఎత్తుకొని వెళ్లాడు. దీనిపై అపార్ట్‌మెంట్ వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.